

# ఈ పెళ్ళికథ చదవండి!

బొళ్లిముంత నాగేశ్వరరావు

**అప్పర్ ఈజిప్టులో** ఐదేళ్ళు డాక్టర్‌గా ప్రాక్టీసు ముగించుకుని, పది లక్షల దాకా మూట గట్టుకుని శాయీంద్రుడు స్వదేశం తిరిగి వచ్చాడు. వచ్చీ రావడంతోనే ఆయనకు ఎదురైన సమస్య కుమార్తె పెళ్ళి ... ఏకైక కుమార్తె కావటంతో ఆయనకు మరింత సమస్య అయింది.

తన కుమార్తె శైలజ అందంగా ఉంటుంది. ముక్కూ ముఖం తీర్చిదిద్దినట్లు మనిషి నిండుగా, చలాకీగా ఉంటుంది.

డాక్టర్ శాయీంద్రుడు ఆలోచనలో పడ్డాడు. శైలజను పెళ్ళి చేసుకునే కుర్రవాడు శైలజనే ఎక్కువగా ఆరాధించాలి. తను ఇచ్చే కట్నం ప్రధానంగా ఉండకూడదు. కష్టాల్లో, సుఖాల్లో శైలజ ప్రక్కన నడవడం తప్ప ఆ కుర్రవాడికి ఇతరమైన దృష్టి ఉండకూడదు. పొత్తిళ్ళలో పెరిగిన తన కుమార్తె పూవుల్లో అతనిచే పూజింప బడాలి. చిన్న మెత్తు కష్టం ఎరుగని తన కుమార్తె అతనిచే ఉన్నతంగా ఆరాధించబడాలి.

అత డలా తన కుమార్తెను వివాహం తర్వాత గుండెలో దాచుకుంటాడని ముందుగా ఎలా తెలుస్తుంది? డాక్టర్ శాయీంద్రుడికి మరో సమస్య అయ్యింది. ఈ నాడు యువతరాన్ని పక్క దార్లకు పట్టించే అనేక ఆకర్షణలు ఈ సమాజంలో పుష్కలంగా ఉన్నాయి. పుష్కలంగా ధనం ఉన్న వాళ్ళు ఆ ఆకర్షణల గాలాల్లో చిక్కుకు పోయి అటు ఆర్థికంగా, ఇటు శారీరకంగా నీరసించి పోతున్నారు. మరి తను కుమార్తెతోపాటు పుష్కలంగా ధనం ఇస్తాడు.

శాయీంద్రుడుకి సమస్య మరింత జటిలమయ్యింది! ఆలోచించిన కొద్దీ అసలు అర్థంకావడం లేదు.

అలా అర్థం కాకుండా, అర్థంకాకుండా ఉన్న ఆయన మేధస్సులోకి అద్భుతమైన ఆలోచన వచ్చి అంతా అర్థమయినట్లే అయిపోయింది!

•  •  •  •

శాయీంద్రుడు తన భవంతిలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. ఆయన పనిమనిషి—

"సార్!" అంటూ కేకవేశాడు.

"ఏమిటి?" తలెత్తి చూశాడు.

"ఎవరో తండ్రీ కొడుకులంట ... తమతో మాట్లాడతారంట ..."

"అచ్చా ... లోనికి తీసుకురా!"

ఉదయం ఎనిమిది గంటల సమయం. భవంతి గేటు తెరచిన చప్పుడు కిర్రు మంది. చల్లగా వీస్తున్న గాలికి ప్రహరీ ప్రక్కనే వరుసలో ఉన్న అశోక వృక్షాలు మెల్లగా తల లాడిస్తూ ఆకుల్ని ఊపుతున్నాయి. ఆకాశంలో అక్కడక్కడ మేఘాలున్నాయి. మబ్బు తునక జేబు రుమాలుని ముఖానికి సూర్యుడు అడ్డంగా పెట్టుకోవడంతో ఆ ప్రాంత మంతా నీడగా ఉంది. ప్రహరీ మూల నున్న వేపచెట్టు గుబుర్లో కోయిల కనపడకుండా గానం చేస్తుంది.

పేపరు ప్రకటన తర్వాత తన ఇంటికి వస్తున్న మొదటి కేసు. తను చేయబోయే ప్రయోగంలో మొదటి కేసు.

డాక్టర్ శాయీంద్రుడు ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. మెల్లిగా ఫోనెత్తాడు.

"హలో ..."

"ఎవరు కావాలండీ?"

నెంబరు చెప్పాడు. మరుక్షణంలో కనెక్షన్ వచ్చింది అవతలి నుండి.

"ఎవరు, సార్?"

"నేనే ... డాక్టర్ శాయీంద్ర ..."

"నమస్తే, సార్ ... నేనే చెప్పండి."

"అనుకున్న ప్రకారం అవసరం తగిలింది. వెంటనే కారేసుకు రావాలి ..."

"వోకే, సార్! ఇప్పుడే వస్తున్నా."

డాక్టర్ శాయీంద్రుడు తృప్తిగా నవ్వుకున్నాడు. పహిల్వాన్ పరమేశం వస్తున్నాడు. ఈ పేటలో తనెంత చెప్తే అంత చేస్తాడు. బాడీని ఎంత చక్కగా బిల్డప్ చేశాడు. ఆహార విషయాల్లో తన సలహా లేందే పంటి క్రిందకు పలుకు కూడా ఎత్తడు. అతనతో అతనికి నిత్యం అవుసరం... కానీ ఇప్పుడు తను చేయబోయే ప్రయోగంలో పరమేశం అవుసరం ... మనసులో అనుకుంటూ శాయీంద్రుడు వరండాలోకి వచ్చాడు.

అప్పటికే తండ్రీ కొడుకులు వచ్చి నిలబడ్డారు.

శాయీంద్రుడు వాళ్ళను పరిశీలనగా చూశాడు.

తండ్రి గూటంలా ఉన్నాడు. మెడ పొట్టిది. కడుపు లావుగా ఉంది. తల మీద వెంట్రుకల్లేవు. బుగ్గలు ఇప్పటికీ నున్నగా ఉన్నాయి. మీసాలు పెంచాడు.

అతనే ముందుగా నమస్కారం చేసి తనను తాను పరిచయం చేసుకున్నాడు.

''నా పేరు ముకుందరావు. కలవలూరు. ఇక్కడికి ఇరవై ఐదు మైళ్ళ దూరం! 'సి' క్లాస్ టవున్. అక్కడ నాకో సినిమా హాలూ, మూడు ఫాన్సీ షాపులూ, ఒక పుస్తకాల షాపూ ... ఒక రిటైల్ కొట్టూ ఉన్నాయి. మూడు పెద్ద పెద్ద భవనా లున్నాయి. ఒకటి స్టేట్ బాంకుకీ, రెండోది ఆంధ్రా బాంక్‌కీ అద్దెకిచ్చాను. మూడోదాంట్లో మేమే ఉంటున్నాం.

వీడు మా రెండో అబ్బాయి. పేరు రాజేశ్వరరావు. పెద్దవాడు సినిమాహాలు వ్యవహారం చూసుకుంటాడు. వీడు ఫాన్సీ షాపుల వ్యవహారమూ, రిటైల్ షాపు వ్యవహారమూ చూసుకుంటాడు.''

డాక్టర్ శాయింద్రుడు రాజేశ్వరరావు వంక చూశాడు. మనిషి తండ్రిలాగానే గుండ్రంగా, నున్నగా ఉన్నాడు. తండ్రికంటే ఎత్తుగా ఉన్నాడు. ఆధునిక మైన ఫాషన్ల ప్రభావం అతనిమీద ఉంది. హిప్పీ క్రాపు. మీసాలు సన్నగా క్రిందకు దిగాయి. మనిషి ఎర్రగా ఉన్నాడు. ముఖం ఆకర్షణీయంగానే ఉంది.

వారిరువురినీ వెయిటింగ్ రూమ్‌లోకి ఆహ్వానించి కూర్చోమన్నాడు. వారు కూర్చున్నారు.

రాజేశ్వరరావు గదిని పరిశీలించాడు. గోడలమీద అందమైన ప్రకృతి దృశ్యాలు కనిపించాయి. ప్రముఖ చిత్రకారులు గీసిన బొమ్మలు ... డాక్టర్ గారు వాటికంత విలువ ఎందుకిచ్చాడో రాజేశ్వరరావుకు అర్థంకాలేదు.

తమ ఇంట్లో అయితే లక్ష్మీదేవి ఫోటో ఒకటి తప్ప తమ తండ్రి దేన్నీ అనుమతించలేదు. తమ ఇల్లు భవనమే గాని, అలంకరణ లంటూ ఏం ఉండవు.

ఇంతలో వారికి కాఫీ సర్వ్ చేయటం జరిగింది. తండ్రీ, కొడుకులు తీసుకున్నారు.

డాక్టర్ గారు లోనికి పోయారు.

రాజేశ్వరరావు మనసు ఆశ్చర్యంగానూ ... కాస్తంత ఆందోళనగానూ ఉంది. పేపరులో చదివిన ప్రకటన మనసులో పదే పదే రింగవుతూంది!

''అప్పర్ ఈజిప్టులో ఐదు సంవత్సరాలు దిగ్విజయ మైన ప్రాక్టీసు ముగించుకుని ఇటీవలే స్వదేశానికి తిరిగి వచ్చిన డాక్టర్ శాయింద్రుడు ఈ క్రింది విధంగా చెప్తున్నాడు:

''నా కున్న ఏకైక కుమార్తె శైలజ. ఆమెను వివాహం ఆడేందుకు వరుడు కావాలి. అతని కో చిన్న పరీక్ష ఉంటుంది. ఆ పరీక్షలో అతడు నెగ్గితే ... లక్ష్మీ సౌభాగ్యవతి ఐన నా కుమార్తె నిచ్చి ఘనంగా పెళ్ళిచేస్తాను.''

లక్ష్మీ అనే పదాన్ని ముకుందరావు అండర్‌లైన్ చేశాడు. అండర్‌లైన్ చేసి కొడుక్కు వివరించాడు.!

''...ఇందులో నష్ట పోయేది ఏం ఉండదుబాబూ! పరీక్ష నెగ్గావనుకో ... పిల్లతోపాటు లక్ష్మీ ... పరీక్ష నెగ్గలే దనుకో ... మన దారిన మనం తిరిగి వచ్చేస్తాం.''

''మంత్రుల పేరు అడుగుతాడేమో, నాన్నా.''

''దానిదేముందిరా ... మన కిరాణా కొట్టుకొచ్చే సాంఘీకశాస్త్రం మాస్టారు లేడూ ... ఆయన్ను అడిగెయ్. ఇంకా కొన్ని జనరల్ విషయాలు కూడా అడుగు ...''

రాజేశ్వరరావు తలూపాడు. తండ్రి చెప్పినట్లే మాస్టారు నడిగి ఒక టావు నిండా వ్రాసుకుని రెండు రోజులు బట్టీ పట్టాడు. తర్వాత తను రెడీయే నన్నాడు.

మరోసారి రాజేశ్వరరావుకు మనసులో ఆ విషయాలు మెదిలాయి! జేబులోంచి కాగితం తీసి ఆరోగ్య మంత్రి గారి పేరును ఐదోసారి చూసుకున్నాడు. పరీక్ష పెట్టేది డాక్టరు గనుక ఆ శాఖకు ప్రాముఖ్య మీవచ్చు ...

రాజేశ్వరరావు మనసులో కాస్త విసుక్కున్నాడు కూడా!

అయినా ఈ పరీక్ష లేంటి దరిద్రం. వెనుక రాజులు పెట్టినట్టు ... ఈయనేమన్నా రాజా! మత్స్య యంత్రాన్ని కొట్టమనీ, విల్లు నెత్తమనీ, అలా కొడితేనే పిల్లని స్తాననీ, ఇలా ఎత్తితేనే పిల్ల నిస్తాననీ ... ఇప్పుడు తనకే పరీక్ష ఉంటుందో ...''

ఇంతలో అడుగుల చప్పుడు వినపడటంతో రాజేశ్వరరావు ఆలోచించే క్రమాన్ని తప్పాడు. వచ్చేది ఎవరా అనుకుంటూ కళ్ళు అటు వైపుకి తిప్పాడు.

ఒక పనిమనిషి వచ్చి ...

''మిమ్మల్ని సార్ గారు భవంతి వెనుక వైపుకి రమ్మంటున్నారు.'' తండ్రీ కొడుకు లిద్దరూ లేచి పనిమనిషి వెంట నడిచారు.

భవంతి వెనుక విశాలమైన ప్రదేశం ఉంది. రక రకాల పూల చెట్లు పొదల్లా పెరిగి అందంగా కనిపిస్తున్నాయి. అప్పటివరకూ గానం చేసిన కోయిల ఆకుల్లో అణిగి మణిగి విశ్రాంతి తీసుకుంటోంది. మబ్బు తునక జేబురుమాల్ని ముఖానికి అడ్డంగా తీసి సూర్యుడా ప్రాంతాన్ని చూడటం మొదలెట్టాడు. అంతటా తెల్లగా ఎండ పరుచుకుంది.

భవంతి వెనుక భాగం అవటంతో ఆ ప్రదేశ మంతా చల్లని నీడ పరుచుకుని ఉంది.

ఒక చోట నాలుగు కుర్చీలు, మధ్య టీపాయ్ ఉన్నాయి. అక్కడ అంతకుముందే డాక్టర్‌గారు ఒక కుర్చీలో కూర్చుని ఉన్నాడు. తండ్రీ కొడుకుల్ని చూసి చిరునవ్వుతో ఆహ్వానించి కూర్చోమన్నాడు.

పరీక్ష ఇక్కడ మొదలవుతుంది కాబోలు ... మనసులోనే రాజేశ్వరరావు అనుకున్నాడు.

ఇద్దరూ కూర్చున్నాక పూ పొదల్లోంచి ఒక అమ్మాయి అప్సరసలా అక్కడికి నడుచుకుంటూ వచ్చింది. రాజేశ్వరరావు ఆ అందాన్ని చూసి కొంచెం ఆశ్చర్యపోయాడు.

తర్వాత వెంటనే 'మరి పరీక్ష ఎలా ఉంటుందో' అనుకున్నాడు. నాలుగో కుర్చీ ఖాళీగా ఉంటే అమ్మాయి కూర్చుంది. టీపాయ్ మీద పనిమనిషి ఫ్లవర్ వాజిన్ అమర్చిపోయాడు. అందులో కృత్రిమ మైన ప్లాస్టిక్ పూవులు గాక ఆ రోజు వికసించిన సహజమైన పూలున్నాయి. చూడటానికి మరింత అందంగా ఉంది.

ఫ్లవర్ వాజిన్ కంటే సహజమైన అందాల్తో అమ్మాయి కూర్చుని ఉంది.


డాక్టర్ శాయింద్ర చెప్పటం మొదలెట్టాడు.

''ఈ అమ్మాయే నా కుమార్తె... పేరు శైలజ. వివాహం కొత్త తరహాలో జరిపించాలని నా ఉబలాటం. ఆ పద్ధతి మన దేశానిది కాదు. నేను అప్పర్ ఈజిప్ట్‌లో ఉన్నప్పుడు అక్కడ జరిగే వివాహ పద్ధతి నన్నెంతగానో ఆకర్షించింది. అక్కడ వధువు ముందు వరుడికో చిన్న పరీక్ష పెట్టేవారు ...''

శాయింద్రుడు అక్కడి వరకూ చెప్పి ఆగి పోయాడు.

''ఏం పరీక్ష?'' ముకుందరావు ప్రశ్నించాడు.

''అదిగో అటు చూడండి'' శాయింద్రుడనగానే పహిల్వాన్ పరమేశు వస్తాదు ఫోజులో మాత్రమే అక్కడికి వచ్చాడు. చేతిల్లో భయంగొల్పే కొరడా ఉంది. మనిషి భయంకరంగా కనిపించాడు. గుబురు మీసాలపై బారుగా ఉండే ముక్కూ, ఆ ముక్కుకి ప్రైభాగంలో అటూ, ఇటూ చింతనిప్పుల్లా ఎర్రగా కనిపించే కళ్ళూ ... ఆ కళ్ళపైన నల్లగా వత్తుగా కనిపించే కనుబొమలు, ఆ పైన ఇరుకుగా ఉన్న నొసలూ, ఆ నొసలుపై నున్నగా కనిపించే గుండూ... అంతకుముందు శైలజ అందాన్ని చూస్తూ మురిసి



పోయే రాజేశ్వరరావు ... ఒక్కసారి గతుక్కుమన్నాడు. ముకుందరావుకు చల్లని నీడలోముచ్చెమటలుపోశాయి.

డాక్టర్ శాయీంద్రుడు చెప్పుకు పోతున్నాడు:

"ఈ వివాహానికి పెద్ద హంగామా ఏం ఉండదు. కట్నాలు, కానుకలు అసలుండవు. కేవలం వధువు మాత్రమే వరుడు ముందు నిలబడుతుంది. అక్కడ వివాహాల్లో వధువుకోసం వరుడు ఎంతగా ఆరాట పడతాడో నేను స్వయంగా అనేక వివాహాల్లో చూశాను. కాబోయే జీవిత భాగస్వామికోసం ఎంతటి త్యాగాని కైనా అక్కడి వరుడు సిద్ధపడేవాడు. తనకోసం ఎంతటి కష్టాన్నైనా సంతోషంగా స్వీకరించే భర్త దొరకడం ఒక పెద్ద అదృష్టంగా వధువు భావిస్తుంది.

ఈ విషయాలన్నీ ఎక్కడ ఎలా బయట పడతా యని మీకు సందేహం రావచ్చు ...

అన్నం ఉడికిం దనటానికి మనం అన్ని మెతుకుల్నీ పట్టుకు చూడంగదా! అందుకని అక్కడ వధువు తరుపు మనుష్యులు వరుడికి చిన్న పరీక్ష పెడతారు.

పరీక్షంటే మరేం ఉండదు. ఆ వస్తాదు ఒక విధంగా ఈ వివాహానికి పురోహితుడు లాంటివాడు. వివాహం జరిపించేది అతనే. వధువునీ, వరుణ్ణీ కాస్త దూరంగా, ఎదురెదురుగా నిలబెడుతాడు. తన బలం కొద్దీ నాలుగు కొరడా దెబ్బల్ని వరుణ్ని కొడతాడు. ఏ దెబ్బక్కూడా వరుడు 'అబ్బా' అనకూడదు. కొరడా దెబ్బలకి బాధ కలుగుతుంది గదా ... మరెందు కనగూడదూ ... అంటూ మీరు అడగ వద్దును. కొరడా దెబ్బల బాధకంటే వధువు అందచందాలు, ముందు కాలంలో ఆమెతో జీవితం వరుడు మనసులో ప్రధానంగా ఉండాలి. అందుకే 'అబ్బా' అనకూడదు. అది దేనికి సంకేతంగా నిలిచిపోతుందో తెలుసా?! ముందు రాబోయే కష్టాల్ని కూడా జీవిత భాగస్వామి కోసం సుఖంగా స్వీకరించే మానసిక స్థాయి ఈ వరుడికి ఉందీ అనటానికి చక్కగా సరిపోతుంది ..."

ఇంతలో పహిల్వాన్ పరమేశు అడుగులు వేసుకుంటూ ముందుకు వచ్చాడు. ఈ పరీక్ష తాలూకు అనూహ్యమైన పరిణామానికి రాజేశ్వరరావు ఒక్కసారి పెద్దగా కేకవేసి కుర్చీలో కూలిపోయాడు. ముకుంద రావు కంగారు పడిపోయాడు.

డాక్టర్ శాయీంద్రుడ్ని చేతులు పట్టుకుని ...

"బాబూ! ఈ వివాహం వద్దూ ... మరేంవద్దు... మా రాజీ మూర్ఛపోయాడు. పరీక్షంటే ఏదో ప్రశ్న లడుగుతారు ... సమాధానాలు చెప్పొచ్చనుకున్నాంగానీ ఈ కొరడా దెబ్బల పరీక్ష ... అందులోనూ ఈ వస్తాదు కొట్టే కొరడా దెబ్బలని తెలిస్తే రాకనే పోదుం."


ఒక్కసారి అరిచి బోరుమన్నాడు.

పహిల్వాన్ పరమేశం రాజేశ్వరరావుని ట్రీట్‌మెంట్ రూంకి చేర్చాడు. డాక్టర్ శాయీంద్రుడు ఏవో ఇంజెక్షన్ ఇచ్చి ఉపచర్యలు చేశాక రాజేశ్వరరావు కోలుకున్నాడు.

మెల్లిగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా కనిపించిన తండ్రిని ఒక్కసారిగా కౌగలించుకుని —

"నాన్నోయ్! నా కీ పెళ్ళి వద్దు... నీకు దణ్ణం పెడతాను. నా కీ పెళ్ళొద్దు" అన్నాడు. కొడుకు వీపు చరుస్తూ ...

"అలాగే, రాజీ! వెళ్దాం — ఇప్పుడే వెళ్దాం"



అంటూ అభయమిచ్చాడు ముకుందరావు.

తన మొదటి ప్రయోగం అలా ఫెయిల్ అయ్యే సరికి శాయీంద్రుడు కొంచెం నొచ్చుకున్నాడు. తమ జాతి కంటే అప్పర్ ఈజిప్టులో నివశిస్తున్న జనం ఎంత గొప్పవాళ్ళో అనుకున్నాడు. వధువుల కోసం కొరడా దెబ్బల్ని సంతోషంగా తింటున్న అక్కడి వరులు ఎంత నిష్కల్మషమైన, నిజాయితీతోకూడిన స్వచ్ఛమైన దాంపత్య జీవితాన్ని కోరుకుంటున్నారో అర్థం చేసుకున్న డాక్టర్ శాయీంద్రుడికి నిరాశ కలిగింది. తను తలపెట్టిన ప్రయోగాత్మక వివాహం ఫలించదేమోనన్న ఆవేదన కలిగింది.

కొడుకును నడిపించుకుంటూ అప్పటికే ముకుంద రావు మెట్లు దిగి పోతున్నాడు.

పని మనిషిని డాక్టర్ శాయీంద్రుడు పిలిచి చెవులో ఏదో రహస్యంగా చెప్పాడు.

ముకుందరావు కొడుకుతో అప్పటికే గేటు దగ్గ రకు చేరాడు. పనిమనిషి పరుగెత్తుకుంటూ వెళ్ళి తండ్రీ కొడుకుల కా విషయాన్ని చెప్పాడు. పని మనిషి చెప్పిన ఆ మాటలు విన్నాక—

తండ్రీ కొడుకుల ముఖాలు పద్మాల్లా వికసించాయి. వెంటనే వాళ్ళు త్వరత్వరగా అడుగులు వేసుకుంటూ వెను దిరిగి వచ్చారు.

వచ్చి శాయీంద్రుడు ముందు నిలబడి ...

"ఆ మాట మొదట చెప్పారు కాదేం. అదర గొట్టారు కదండీ ... కట్నం కానుకలు లేవంటిరి. పది లక్షలూ పిల్ల చేతిలో పెట్టి ఎదురుగ్గా నిలబడ మనండి! నాలుగు దెబ్బలు కాదు ... నాలుగు నాళ్ళు పదహారు దెబ్బలైనా భరిస్తాడు మావాడు. అప్పుడు పిల్లవంకే చూడ నక్కర్లేదు. పిల్ల చేతిలో ఉన్న పది లక్షల వంక చూస్తుంటే ... ఎంతటి బాధనైనా సుఖంగా భరిస్తాడు! ఈ పెళ్ళికి మేం సిద్ధమే ... లగ్నాల కెప్పుడు రమ్మంటారు."

ముకుందరావు అంటుంటే ... రాజేశ్వరరావు చిరు నవ్వుల్ని చిందిస్తూ ఎంతో ధైర్యంగా, హుందాగా, నిండుగా, నిటారుగా నిలబడ్డాడు. తను అవునంటే కాబోయే అల్లుడ్ని చూసి అతని మనసులో మెదిలే తన బీరువాలోని పది లక్షల్ని తలుచుకుని ఈ సారి డాక్టర్ గారు మూర్ఛపోయారు. *

